# 9
# ప్రభువు సంఘము: ఆరాధన (1)

నిర్వహణ శరీరమునకు అస్థిపంజరంవంటిదైతే, ఆరాధన హృదయమైయుంటుంది. "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను" (మత్తయి 4:10బి).

ఆరాధనలోని రెండు ప్రముఖమైన విషయాలేవంటే: ఏమి జరిపించాలి మరియు ఎలా జరిపించాలి అనేవి. ప్రభువైన యేసు సమరయ స్త్రీతో చెప్పిందేమంటే, "... యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; దేవుడు **ఆత్మ** గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:23, 24). దేవుని "ఆత్మతో" ఆరాధించడమంటే ఒకని హృదయంతో ఆరాధించడం. నిజ ఆరాధకులు వారు ఏమి చేస్తున్నారో దాన్నిగూర్చి ఆలోచిస్తారు; పరలోకంవైపు వారి ఆలోచనలను మళ్లిస్తారు. దేవుని "సత్యంతో" ఆరాధించడ మంటే, దేవుని "వాక్యము సత్యమని" ప్రభువైన యేసు తెలిపినట్లు (యోహాను 17:17), ఆయన తన వాక్యమందు సూచించిన ప్రకారం ఆరాధించడమే.

ఈ పాఠంలోను తరువాత దానిలోను, ప్రభువు సంఘంలో ఆరాధన ఎట్టిదై యుండాలని లేఖనాలు బోధించాయో పరిశీలించుదాం. మనం అలా చేస్తూ ఉండగా, ఆరాధనలో "ఏమి" మరియు "ఎలాగు" అనే వాటిని ప్రధానంగా చూద్దాం. దేవుని ఆరాధించడంలో సరియైన కార్యములు, సరియైన తత్వము రెండును చేర్చబడవలసియుంది.

## ఆరాధన యొక్క ప్రత్యేకమైన దినము

ఏ దినమునైనా మనం దేవుని పూజింపవచ్చు. సంఘం తొలిగా స్థాపింపబడినప్పుడు, క్రైస్తవులు అనుదినం కూడేవారు (అపొ. 2:46). అయినా, క్రైస్తవులందరు ఏకంగా ఆరాధనకు కూడివచ్చే వారంలో ప్రత్యేకమైన దినము ఒకటి ఉన్నట్టు క్రొత్త నిబంధన బోధిస్తుంది.

పాత నిబంధనలో, ప్రత్యేకమైన ఆరాధనా దినం సబ్బాతు దినం, అది వారంలో ఏడో దినం, అంటే శనివారం (నిర్గమ. 20:10, 11). క్రైస్తవ్యంలో, ప్రత్యేకమైన దినం వారంలో మొదటి దినం–ఆదివారం. ఇది క్రీస్తు మృతులలోనుండి లేచిన దినం (మత్తయి 28:1, 6). (ఇది క్రీస్తు సంఘ స్థాపన దినం అపొ. 2.) ఇది ఆది క్రైస్తవులు కూడిన దినం (1 కొరింథీ. 16:2), ఇది వారు ప్రభురాత్రి భోజనం చేసే దినం (అపొ. 20:7). ఆదివారం "ప్రభువు దినమని" పిలువబడింది (ప్రకటన 1:10).[1]

ఆరాధనను వ్యక్తపరచే అయిదు అంశాలను మనం చదువబోతాం. వీటిలో మూడు ఏ రోజునైనా చేయవచ్చు: బైబిలు చదవడం, ప్రార్థన, పాడడం అనేవి. రెండు మాత్రం కేవలం ప్రభువు దినానికే సంబంధించినవి: ప్రభురాత్రి భోజనము, కానుకల సమర్పణ.

## ఆరాధనను వ్యక్తపరచేవి

### ప్రభురాత్రి భోజనం

మనం ఆలోచింపవలెనని కోరుకున్న భావనలో మొదటిది ప్రభురాత్రి భోజనం. తన శిష్యులతో కూడ చివరి పస్కా విందులో,[2] ఆయన ప్రభురాత్రి భోజనాన్ని స్థాపించాడు.

> ... ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దానిని విరిచి – "యిది మీ కొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను." ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తికొని – "యీ పాత్ర నా రక్తమువలననైన క్రొత్త నిబంధన; మీరు దీనిలోనిది త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను." మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు. కాబట్టి యెవడు అయోగ్యముగా[3] ప్రభువు యొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను; ఆలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను (1 కొరింథీ. 11:23-28).[4]

ఈ భోజనాన్ని స్థాపించడంలో, ప్రభువు పులియని రొట్టెను[5] మరియు ద్రాక్షారసమును[6] వినియోగించాడు. తొలిగా ఈ భోజనాన్ని ఆచరించినవారు రొట్టెలోను, ద్రాక్షారసములోను పాలుపొందారు.[7]

"ఇది నా శరీరము" అని ప్రభువు సెలవిచ్చినప్పుడు, తన మాంసముగా ఆ రొట్టె మర్మమైన విధానంలోను, మాయాజాలంలాగానో మారుతుందని ఆయన భావం కాదు. ఆయన వారి యెదుటనే ఉన్నాడు. ఆయన మాంసం ఆయనను అంటుకునే ఉంది. నా పర్సులోనుండి ఒక ఫోటో బయటకి లాగి, "ఇదిగో నా మనుమ సంతతి" అని నేనంటే దాని భావమేమో, ఆయన అర్థం కూడా అలాటిదే. ఆ పులియని రొట్టె క్రీస్తు శరీరము యొక్క ప్రాతినిధ్యమైయుంది, మరియు ద్రాక్షారసము ఆయన రక్తము యొక్క ప్రాతి నిధ్యమైయుంది.

ప్రభురాత్రి భోజనాన్ని కొన్ని సార్లు "కమ్యూనియన్" అని పిలుస్తారు (1 కొరింథీ. 10:16; KJV[8]) లేక "ప్రభువు బల్ల" అని కూడా అంటారు (1 కొరింథీ. 10:21). ఆరాధకులు పులియని రొట్టెను విరుచుటతో ఆరాధన జరిపిస్తారు గనుక, దానిని "రొట్టె విరుచుట" అనియు అంటారు:[9] ఆది క్రైస్తవులు "... రొట్టె విరుచుటయందు ... ఎడతెగక యుండిరి" (అపొ. 2:42).

వారంలో ప్రతి మొదటి దినాన క్రొత్త నిబంధన సంఘము ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుతూ ఉండేది. సంఘం మొదటి దినాన కూడేది (1 కొరింథీ. 16:1, 2 చూడు). వారి పరిచర్య రొట్టె విరుచుట చుట్టు తిరుగుతుండేది. పౌలు, లూకా, మిగిలినవారు త్రోయకు చేరుకున్నట్టు అపొ. 20లో మనం చదువుతాం. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు ... వారితో ప్రసంగించుచు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడుచుండెను" అని లూకా వ్రాశాడు (అపొ. 20:7). త్రోయలోని

సంఘము ఆదివారమున కూడివచ్చినప్పుడు, వారి ప్రాథమిక ఉద్దేశము రొట్టె విరుచుటయై ఉండింది. ఇది సంఘపు ఆచారంగా అనేక సంవత్సరాలు కొనసాగినట్టు ఆరంభ శతాబ్దాలలోని క్రైస్తవ రచనలు సూచించాయి. వారంలో ప్రతి తొలి దినాన క్రైస్తవులు కూడివచ్చినప్పుడు, వారి ప్రాథమిక దృష్టి ప్రభురాత్రి భోజనంవైపు మల్చబడింది.

ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించడంలో, దేవుని ఆరాధించడానికి గాను, సరియైన సంగతులు చేయడం ప్రాముఖ్యం: క్రైస్తవులు పులియని రొట్టెలోను, ద్రాక్షారసములోను, వారంలో ప్రతి తొలి దినాన పాలుపొందవలసియుంటారు. సరియైన విధానంలోను అందులో పాలుపొందవలసినవారై యుంటారు: ఆరాధకులు ప్రభువైన యేసు యొక్క బలిమీదను, ఆ బలి తమకేమైయుందో దానిమీదను తమ దృష్టిని నిలుపవలసినవారై యున్నారు (1 కొరింథీ. 11:26–29 తిరిగి చదువు).

### దేవుని వాక్యము

ప్రభురాత్రి భోజనంలో పాలుపొందడానికి త్రోయలోని సంఘం కూడివచ్చినప్పుడు, దేవుని చిత్తమును గూర్చి పౌలు వారికి బోధించాడు (అపొ. 20:7).[10] దేవునికి సన్నిహితులు కావడంలో దేవుని వాక్యము ప్రకటింపబడడం ప్రాముఖ్యం. దేవుని వాక్యాన్ని చదవ డానికిగాని, చర్చించడానికిగాని ఆది సంఘం తరచుగా కూడి వస్తూ ఉండేది (అపొ. 2:42; కొలస్సీ. 4:16).

బహిరంగపు ఆరాధన సమయమందు వాక్యము బోధించడంలో కొన్ని ఆంక్షలు విధింపబడ్డాయి. దేవుని వాక్యమే ప్రకటింపబడాలి గాని మనుష్యుల అభిప్రాయాలు గాని, తత్వాలు గాని బోధింపకూడదు (2 తిమోతి 4:1–4).[11] కేవలం పురుషులు మాత్రమే బహిరంగ కూడికల్లో బోధించవలసి యుంటుంది (1 కొరింథీ. 14:34).[12]

లేఖనానుసారంగా "ఏమి?" బోధించాలి, ఉపదేశించాలి అనేదాన్ని గమనించితేనే చాలదు. దేవుని ఆనందింపజేసే ప్రసంగం ఒక సువార్తికుడు అందిస్తున్నాడన్న వాస్తవం మీదనే ప్రతి శ్రోతయు ఆరాధిస్తున్నాడనే గ్యారంటీ ఏమీలేదు. శ్రోతయొక్క హృదయంలో సహా ఆరాధన జరుగుతూ ఉండాలి. ప్రతి ఒక్కరు ప్రకటించబడుతున్న దానిలో పాలుపొందుతూ తన స్వంత జీవితానికి దానిని వర్తింపచేసికోవలసి యుంటుంది.

### ప్రార్థన

ఆరాధనలో ప్రాముఖ్యమైన భాగము ప్రార్థన. "ఎడతెగక ప్రార్థన చేయుడి" అని థెస్సలొనీకలోని క్రైస్తవులకు పౌలు ఆదేశించాడు (1 థెస్స. 5:17). మనం బైబిలు చదువుతున్నప్పుడు దేవుడు మనతో మాట్లాడుతున్నాడు, మనం ప్రార్థించేటప్పుడు మనం దేవునితో మాట్లాడుతున్నామని ఒక వ్యక్తి అన్నాడు. క్రొత్త నిబంధనలో, క్రైస్తవులు కూడివచ్చినప్పుడు, వారు ప్రార్థించినట్టు కన్పిస్తుంది (అపొ. 2:42; 4:23, 24; 6:6; 12:12).

బహిరంగమైన, బహిరంగం కాని ఆరాధనలో ప్రార్థన బహు ప్రాముఖ్యమైనది. ప్రతి క్రైస్తవుడును తన ప్రార్థనా జీవితంలో వృద్ధి పొందవలసియుంది (మత్తయి

6:5-15; 14:23; లూకా 5:16; అపొ. 10:9; 16:25).

బహిరంగపు ఆరాధనలో స్థానిక సంఘాన్ని పురుషులు పలుమార్లు ప్రార్థనలో నడిపిస్తూ ఉంటారు. "కావున ప్రతిస్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను" అని పౌలు వ్రాశాడు (1 తిమోతి 2:8). "పురుషులు" అనేదానికి ఉపయోగింపబడిన గ్రీకు పదానికి "స్త్రీలకు" భిన్నంగా "పురుషులు" అని సూచిస్తుంది. బహిరంగ ఆరాధనా కార్యక్రమాల్లో పురుషులే ప్రార్థనల్లో నడిపించాలి.

మరల, నిజంగానే ఆరాధన జరుగకుండ, ప్రార్థనకు సంబంధించి "ఏమి" అనేది జరుగవచ్చు. ప్రార్థనలో నడిపించేవాడు దేవుని ప్రసన్నతను ఎరిగి (గుర్తించి) తన ఆలోచనలు మనుష్యులవైపు కాక దేవుని వైపునకే మరల్చవలసి యుంటాడు. ప్రార్థనయందు నడిపింపబడేవారు దానిని తమ హృదయాలలో ప్రతిధ్వనింపజేస్తూ, తమ సొంత విన్నపాలను, కృతజ్ఞతాస్తుతులను దానితో చేర్చాలి. అప్పుడు వారు "ఆమెన్" అని చెప్పవచ్చు (1 కొరింథీ. 14:16; మత్తయి 6:13; రోమా 16:27; ఎఫెసీ. 3:21లను కూడా చూడు).[13]

**కానుకల సమర్పణ**

వారం ప్రతి తొలి దినాన కానుకల సమర్పణ[14] ద్వారా మన అభినందనను దేవునికి వ్యక్తపరచవచ్చు. కొరింథులోని సంఘానికి పౌలు యిలా తెలిపాడు,

> పరిశుద్ధులకొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ[15] ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది[16] తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను (1 కొరింథీ. 16:1, 2).

వారి రాబడిలో కొంత శాతం యివ్వవలసిందిగా పాత నిబంధన విధించింది: ఆరాధకునికి కలిగిన దానంతటిలో పదియవ భాగం. దీనిని "దశమ భాగం" అని అంటారు (లేవీయ. 27:30; ద్వితీయో. 14:22; మలాకీ 3:8-10). క్రొత్త నిబంధనలో అదే విధంగా కొంత శాతం యివ్వవలసినదిగా చెప్పబడలేదు. అయితే, వారు యిష్టపూర్వకంగాను, ధారాళంగాను, సంతోషంగాను యివ్వవలసిందిగా ఆదేశింపబడ్డారు (2 కొరింథీ. 9:6, 7) ["రాబడితో సంబంధంతోనే"] (1 కొరింథీ. 16:2; NIV). వారు సంపాదించే దానిలో పదియవ వంతు లేక అంతకంటే ఎక్కువ యిచ్చేవారున్నారు. అయితే అది బలవంతంతో కాక, కృతజ్ఞతతోనే వారీపనిని జరిగిస్తారు.

ఒకడు "అభివృద్ధి చెందియు" ఆరాధింపకపోవచ్చు. ఆరాధకుడు తన కానుకను సమర్పించిన తరువాత, దేవునికి కృతజ్ఞతా వందనములు చెల్లించి, తన కానుకను అంగీకరించవలసిందిగా అతడు ప్రార్థించాలి.

**పాటలు పాడడం**

ఆరాధనను వ్యక్తపరచే అయిదవ విధానం పాటలు పాడడం. "సంగీతములతోను

కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" పౌలు కొలస్సీ సంఘానికి ఆజ్ఞాపించాడు (కొలస్సీ. 3:16). వచ్చే పాఠంవరకు పాటలు పాడడం మీద మన చర్చను నిలుపు చేద్దాం. అయితే ఆరాధనలో "ఏమి" అనే దాన్ని యిక్కడ నొక్కి చెప్పుదాం: "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధి చెప్పుచు..." "దేవునిగూర్చి గానము చేయుచు" ఆరాధన "ఎలా" జరిగించాలి అనేదాన్ని కూడ అది నొక్కి చెప్పుతుంది: "హృదయములలో కృతజ్ఞతతో. ..."

## ఆరాధన యొక్క ప్రాముఖ్యత

ఆరాధనను గూర్చి క్రొత్త నిబంధన ఉపదేశాన్ని బహిరంగ ఆరాధనపై నొక్కి చెప్పి చర్చించాం. "మనం ఆరాధనకు కూడకపోయినా తేడా ఏమైనా ఉందా?" అని యిప్పుడు మనం అడుగవలసియుంది. ఆరాధనా కార్యక్రమములకు క్రమంగా హాజరవ్వడం ప్రాముఖ్యత లేనట్టు అనేకులు ఆలోచిస్తారు. అయితే బైబిలు ఏమి బోధిస్తుంది? ఈ అంశం మీద దేవుడు మాట్లాడాడని నేర్చుకొంటే ఆశ్చర్యపోతారు.

ఒకప్పుడు నమ్మకస్థులైయున్న క్రైస్తవులకు హెబ్రీయుల గ్రంథం వ్రాయబడింది (హెబ్రీ. 10:32–34). ఏదో ఒక కారణాన్ని బట్టి, వారు అక్కరలేనట్టు అలక్ష్యం చేయ మొదలు పెట్టారు (హెబ్రీ. 2:3). బహిరంగ సంఘ కూడికలో వారు హాజరవ్వడం కూడా అందులో చేర్చబడింది (హెబ్రీ. 10:25). "ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకరినొకడు పురికొల్పవలెనని ఆలోచించతము" అని వారు హెచ్చరింపబడ్డారు (10:24). వారు కూడివచ్చినప్పుడు ఒకరినొకరు బలపరచుకొనడం అందులో ఒక మార్గమైయుంది. అందునుబట్టి మనకు ఈ మాటలు అవసరం: "కొందరు మానుకొను చున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయు(దము)" (10:25).[17] నేటి జనులకు, "ఆ దినము సమీపించుట" అనేది ప్రభువైన యేసు యొక్క రెండవ రాకడ.[18] క్రీస్తు ఏ దినముననైనా రావచ్చు, గనుక మనం ఎల్లప్పుడు సిద్ధపడియుండాలి (మత్తయి 25:13).

తమ హాజరులో ఒడిదుడుకులు గలవారు, వారి క్రైస్తవ జీవితంలోని యితర పరిధులలో ఒడిదుడుకులుగా ఉంటారు. ఈలాటి పరిస్థితికి వ్యతిరేకంగా హెబ్రీ. 10:26–31 యిలా హెచ్చరిస్తుంది:

> మనము సత్యమును గూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధి పూర్వకముగా పాపము చేసినయెడల పాపములకు బలి యికను ఉండదు గాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు, విరోధులను దహించబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును. ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినయెడల

> ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద, కనికరింపబడకుండ వాని చంపించుదురు. ఇట్లుండగా దేవుని కుమారుని, పాదములతో త్రొక్కి, తాను పరిశుద్ధపరచబడుటకు సాధనమైన నిబంధన రక్తమును అపవిత్రమైనదిగా ఎంచి, కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును? "పగ తీర్చుట నా పని, నేనే ప్రతిఫలమిత్తుననియు" మరియు – "ప్రభువు తన ప్రజలకు తీర్పు తీర్చును" అనియు చెప్పిన వానిని ఎరుగుదుము గదా. జీవముగల దేవుని చేతిలోపడుట భయంకరము.

ప్రతి ఆదివారం క్రైస్తవులు ప్రభురాత్రి భోజనంలో పాలుపొందాలనే లేఖనాలను మనం చదివాం. సహవాసముకొరకును, క్షేమాభివృద్ధికొరకును క్రమమైన మీటింగులు అనేక స్థానిక సంఘాలు కలిగియున్నాయి కూడా. తనకు సాధ్యమైనంతవరకు తన జీవితాన్ని క్రీస్తుకు సమర్పించుకున్నవాడు ఆ కూడికలకు తప్పక హాజరౌతాడు. క్రైస్తవ ఎదుగుదలను అవి పెంచుతాయి, మరియు ప్రాముఖ్యమైన వాటిమీద తన దృష్టి కేంద్రీకరింపబడేలా అవి సహాయం చేస్తాయి.

## ముగింపు

ఏ మత శాఖనైనా పరీక్షించగల ప్రశ్నలను రూపొందించేలా ఆరాధనను గూర్చి సరిపోయినంత క్రొత్త నిబంధన ఉపదేశాన్ని నీవు నేర్చుకున్నావు. ఉదాహరణకు, "ప్రతి ఆదివారము అది ప్రభురాత్రి భోజనాన్ని కలిగియుందా?"; "దాని సువార్తికులు దేవుని వాక్యాన్ని నమ్మకంగా ప్రకటించేవారేనా?"; "కేవలం పురుషులు మాత్రమే ఆరాధనను నడిపిస్తారా?"

ఈలాటి పరిశోధన నీవు చేసేటప్పుడు, నీ సొంత హృదయ పరిశీలన చేసికొనడం మానుకోకు. "క్రైస్తవులతో దేవుని ఆరాధించడాన్ని నేను ఎంజాయ్ చేస్తున్నానా?"; "నేను కూడికకు వచ్చినప్పుడు, ఆరాధనకు నేను సిద్ధపడియున్నానా?"; "నేను అక్కడ ఉన్నప్పుడు, నేను నిజంగానే ఆరాధించానా?"[19] ఇవి ప్రాముఖ్యమైన ప్రశ్నలు.

---

సూచనలు

[1]"ప్రభువు దినము" అని యోహాను ఉపయోగించినప్పుడు, ఆదివారాన్ని గూర్చి అతడు మాట్లాడినట్టు దైవప్రేరేపితులు కాని ఆరంభపు క్రైస్తవ రచయితలు స్థిరపరచారు. [2]యూదులకు పస్కాపండుగ ఉంది. ఐగుప్తీయులపైన ఆయన సంహారకుని రప్పించినప్పుడు, ఇశ్రాయేలీయుల యిండ్లను దేవుడు దాటిపోజేసిన సంభవాన్ని యిది గురుతు చేస్తుంది (నిర్గమ. 12 చూడు). [3]ఎంఫసిస్ వ్యక్తిగతమైన యోగ్యతమీద కాదు సుమీ, (పాలుపొందడానికి నిజమైన యోగ్యుడు ఎవడే లేకపోవచ్చు గాని) తాను పాలుపొందే విధానం సరియైనదై యుండాలి. అతడు పాలుపొందుతూ ఉండగా, ప్రభువు చేసిన యాగాన్ని గూర్చి క్రైస్తవుడు ఆలోచిస్తూ ఉండకపోవచ్చు, అతని అంతరంగం అభినందనతో నింపబడినది కాకపోయి ఉండవచ్చు. [4]మత్తయి 26:26–29; మార్కు 14:22–25; లూకా 22:19, 20లను చూడు. [5]పస్కా విందులో పులియని రొట్టె వినియోగింపబడేది (నిర్గమ. 12:15 చూడు). [6]మత్తయి 26:29; మార్కు 14:25; లూకా 22:18 చూడు. నేడు దాని అర్థం ఏమైయున్నా, ఆనాడు మాత్రం అది ద్రాక్షాలరసమే. [7]కొన్ని మత సంస్థలలో, ప్రత్యేకింపబడిన కొందరు మాత్రమే ద్రాక్షారసం పానం చేస్తారు, తక్కినవారు కేవలం రొట్టెను మాత్రమే పుచ్చుకుంటారు. [8]NASB, "పంచుకొనుట." [9]క్రొత్త

నిబంధనలో, “రొట్టె విరుచుట” అనేది సాధారణమైన భోజనాన్ని కూడ సూచిస్తుంది. అది మామూలు భోజనమో లేక ప్రభురాత్రి భోజనమో సందర్భం సూచిస్తుంది. [10]ఇంతకు పౌలు వారికి తెలిపిందేమో సరిగ్గా తెలియదు గాని, దేవుని వాక్యము ఎల్లవేళలా వాని పెదవులమీద ఉంది. అదే ట్రిప్పులో అతడు క్రైస్తవులకు ఏమి చెప్పాడో ఉదాహరణగా ఉంది, అపొ. 20:31, 32 చూడు.

[11]బైబిలు దేవుని వద్దనుండి వచ్చిందనే విషయం సువార్తికుడు గట్టిగా నమ్మాలి అనేది చెప్పనవసరం లేదు. దురదృష్టవశాత్తు, కొన్ని మతశాఖల ప్రసంగ వేదికలను ఆక్రమించేవారు, బైబిలు దైవప్రేరేపిత గ్రంథమని విశ్వసింపనివారైయున్నారు. [12]1 తిమోతి 2:8, 11, 12. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులలో స్త్రీలు ఉపదేశం చేయడానికి క్రొత్త నిబంధన ఏర్పాటు చేసింది (అపొ. 18:26), అయితే సంఘం కూడివచ్చినప్పుడు స్త్రీలు బోధించడానికి గాని ఉపదేశించడానికి గాని అనుమతింపబడలేదు. [13]“ఆమెన్” అనే దానికి నిర్వచనం “ఆలాగే అగునుగాక” అని. అది ప్రార్థన అంతమయ్యే మాటగా కేవలం భావించకూడదు. సువార్తికుడు చెప్పే ఏదో ఒక దానితో నీవు పరిపూర్ణంగా ఏకీభవించినట్లయితే, దానిని “ఆమెన్” అనే మాటతో సూచించవచ్చు. [14]ఇది సాధారణంగా డబ్బును సమర్పించడమై యుంటుంది, కాని ఇతర వస్తువులను సహితం సమర్పించవచ్చు. [15]మొదటిగా చదివినప్పుడు, ప్రతి క్రైస్తవుడు కొంత సొమ్ముతీసి తన యొద్ద దాచిపెట్టమని చెప్పినట్లు అనిపిస్తుంది. తాను వచ్చినప్పుడు సొమ్ము పోగుచేయకూడదని, ఈలాటిది జరుగకుండ తప్పించడానికి పౌలు వ్రాశాడు. ఇది సంఘము చేయవలసిన జమ (1 వ.) పౌలు వచ్చినప్పుడు ఆ జమ అక్కర ఉండదు (2 వ.). “తన యొద్ద కొంత సొమ్ము నిలువజేయవలెను” అనేది కామన్ ఫండ్‌గా జమ చేయమని చెప్పినట్టున్నాడు (“సంఘపు ధన నిధి” అని కొన్ని సార్లు పిలువబడింది). [16]వర్ధిల్లిన కొలది అంటే, సంపాదించినకొలది, ధన సమృద్ధిగలవాడని నేడు మనం ఉపయోగించినట్టు కాక, బైబిలు భావంలో నీవు వర్ధిల్లి యుండవచ్చు. [17]ఒత్తి పలికింది నాది. [18]“ఆ దినము”లనేది యెరూషలేము యొక్క నాశన దినంగా హెబ్రీ రచనను పొందినవారు భావించారని కొందరు తలంచారు. [19]చిన్న బిడ్డల తల్లులకు నేను చిన్న గమనికను వదలిపెట్టాలి: నీ బిడ్డలు చిన్నవారై యున్నప్పుడు ఆరాధించడం కష్టంగా ఉంటుంది, అయితే నమ్మకంగా హాజరు కాకుండ యిది నిన్ను ఆటంకపరచనీయ్యకు. ఆరాధన సమయంలో నీకు చేతనైనంత మట్టుకు ప్రయత్నించు. దేవుడు నిన్ను అర్థం చేసికొంటాడు. ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను నీవు నీ బిడ్డలను పెంచుకొంటూ ఉంటావు (ఎఫెసీ. 6:4).